నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా అస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 నుంచి 10 గంటల వరకు...
మూసారాంబాగ్ జ్ఞాన్‌దీప్ టవర్స్, కృష్ణతులసీ నగర్, ఆండాళ్ నిలయం, దిల్‌సుఖ్‌నగర్ రోడ్, ఎస్‌బీహెచ్ బ్యాంక్, ఇంద్రానగర్, రాజరాజేశ్వరీ టెంపుల్, ఎస్‌బీహెచ్, ఆండాళ్ నిలయం, డీబీఆర్ డయాగ్నస్టిక్ సెంటర్, తనిష్క్ జ్యువెలర్స్, నోబుల్ డిగ్రీ కాలేజీ పరిసర ప్రాంతాలు

ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు...
ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూ హనుమాన్ టెంపుల్, భవానీనగర్, ద్వారకాపురి, ప్రతాప్‌నగర్, భాష్యం స్కూల్ పరిసర ప్రాంతాలు

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు...
గురుదాస్, సలీంనగర్, రామారావ్ కంపెనీ, సలీంనగర్ మిల్క్ బూత్ డౌన్, పద్మావతీ అపార్ట్స్, సలీంనగర్ గణేష్ టెంపుల్ పరిసర ప్రాంతాలు

సాయంత్రం 5 నుంచి 5.45 వరకు...
అక్బర్‌బాగ్, పల్టన్ చౌరస్తా, దయానంద్ నగర్, ఆనంద్‌నగర్, మలక్‌పేట పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి


అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్‌లోని బీఎన్ రెడ్డినగర్ ఫేజ్–1లోని బాలాజీ అపార్ట్‌మెంట్ వద్ద నిత్యం డ్రైనేజీ సమస్య వస్తోందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో లచ్చిరెడ్డి బుధవారం అధికారులు, కాలనీవాసులతో కలిసి సమస్యను పరిశీలించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరివెన్నెల, సూపర్‌వైజర్ జయసింహ, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


శిబిరంలో వైద్య పరీక్షలు చేయికుంటున్న ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: ఆరోగ్యంపై అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. ముత్తూట్ ఎం జార్జ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఎల్‌బీనగర్ సీఐ రామాంజనేయులు, ఎస్ఐలు లింగారెడ్డి, దయాకర్‌రెడ్డి, నిర్వాహకులు శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎం కృష్ణమూర్తి

చైతన్యపురి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపోలో మహిళా ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో పోటీల విజేతలకు బహుమతులు అందజేసినట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో గౌతం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రజని, వందన, ఏఎంటీ ఉషశ్రీ, ఎంఎఫ్ శంకర్, డిప్యూటీ ఎస్పీ డీటీ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలకు రండి


ఈటలను ఆహ్వానిస్తున్న నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

మన్సూరాబాద్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మన్సూరాబాద్‌లోని శైవక్షేత్రం వీరన్నగుట్టపై జరిగే వేడుకలకు హాజరు కావాలని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఈటలను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. డివిజన్ పరిధి హయత్‌నగర్‌లోని వీరన్నగుట్టపై కొలువైన భద్రకాళీ రామలింగేశ్వర స్వామి క్షేత్రం ఎంతో మహిమాన్విత ప్రదేశమని, ఆ మహాశివుడి ఆశీస్సులు పొందాలని కోరినట్లు కార్పొరేటర్ వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నేతలు యాదగిరి, బాలరాజు యాదవ్, శ్రీరాములు, శంకర్‌రెడ్డి, పారంద సాయి పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 11, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 35, క్యాబేజీ 19, ఫ్రెంచి బీన్స్ 40, క్యారెట్ 21, దొండ 25–28, చిక్కుడు 35–50, గోకర 40, బీట్‌రూట్ 19. క్యాప్సికం 55, ఆలు 21, దోస 18, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 50. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

చలివేంద్రం ప్రారంభం

మీర్‌పేట: వేసవి దృష్ట్యా పాదచారులు, వాహనదారుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామని వీటీ రాయల్ ఫౌండేషన్ గ్రూప్ చైర్మన్ కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్ చౌరస్తాలో బుధవారం తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. తనవంతు బాధ్యతగా ఈ ప్రాంతంలో గత ఎనిమిదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, అదే విధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ జి.ప్రవీణ్‌కుమార్, సీఈఓ డి.ధరణీశ్వర్, బ్రాంచి మేనేజర్ కాలేరు నిఖిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలు షురూ

సర్కిల్ కార్యాలయాల్లో ఏర్పాటు
- 'ప్రజాపాలన'లో అందజేసిన దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం
- గృహజ్యోతి, ఇతర పథకాలకు దరఖాస్తుల స్వీకరణ
- అన్ని పని దినాల్లో అందుబాటులో కేంద్రాలు


మలక్‌పేట సర్కిల్–6 ఆఫీసులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రం



ప్రజాపాలన సేవా కేంద్రం బ్యానర్

చాదర్‌ఘాట్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు హామీలను అమలు చేస్తోంది. అయితే, అర్హత ఉండి కూడా ఈ పథకాలకు ఇంకా కొందరు ఎంపిక కాలేదని ప్రభుత్వం గ్రహించింది. ప్రజాపాలన కార్యక్రమంలో అందజేసిన కొందరి దరఖాస్తుల్లో తప్పులు ఉండటం, అర్హత ఉండి కూడా దరఖాస్తు చేసుకోకపోవడం ఇందుకు కారణమని గుర్తించిన ప్రభుత్వం దరఖాస్తుల్లోని తప్పులు సరి చేసేందుకు, కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

◆ ఇందులో భాగంగా మలక్‌పేట సర్కిల్–6లో బుధవారం నుంచి ప్రజాపాలన సేవా కేంద్రాలు అందుబాటులోకి తెచ్చింది.

◆ సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లకు సంబంధించిన కేంద్రాలను సర్కిల్ కార్యాలయంలోనే ఏర్పాటు చేశారు.

◆ దరఖాస్తుల్లో సమస్యలు ఉన్నా, లబ్ధిదారుల ఎంపికలో తప్పులు జరిగినా సవరణ చేయడంతో పాటు దరఖాస్తుదారునికి అవసరమైన సహాయ సహకారాలు ఈ సేవా కేంద్రాల్లో అందిస్తారు.

◆ ఈ కేంద్రాలు సర్కిల్ కార్యాలయాల్లో అన్ని పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి.

◆ సేవా కేంద్రాలలో కంప్యూటర్ ఆపరేటర్, దరఖాస్తుదారులు కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు వంటి వసతులు కల్పించారు. కంప్యూటర్ ఆపరేటర్లకు అధికారులు ప్రజాపాలన లాగిన ఇచ్చారు.

◆ గృహజ్యోతి పథకంలో తప్పుల సవరణతో పాటు కొత్తవాటిని నమోదు చేస్తారు.

◆ ఇటీవల 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే తెల్లరేషన్ కార్డుదారులకు ప్రజాపాలన దరఖాస్తు ద్వారా జీరో బిల్లు ఇస్తున్నారు. అయితే కొంత మంది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోకపోవటంతో అర్హత ఉండి కూడా లబ్ధి పొందలేకపోతున్నారు. వీరంతా ఈ సేవా కేంద్రాల్లో మళ్లీ అన్ని పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకుంటే లబ్ధి చేకూరుతుంది.

సద్వినియోగం చేసుకోండి

మలక్‌పేట సర్కిల్–6 కార్యాలయం ఆవరణలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసాం. రోజూ పనివేళల్లో కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉంటారు. అర్హత ఉన్నవారు అన్ని పత్రాలు అందజేసి లబ్ధి పొందాలి. అన్ని వార్డులకు ఒకే కేంద్రంలో ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఏమైనా సందేహాలు ఉంటే అడిగి నివృత్తి చేసుకోవచ్చు.
– డీసీ జయంత్

ఉచిత ఎల్‌ఆర్‌ఎస్ హామీ అమలు చేయాల్సిందే


ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దయానంద్ గుప్తా, ఎగ్గె మల్లేశం తదితరులు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: నయాపైసా ఖర్చు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం డివిజన్‌లోని జీహెచ్ఎంసీ ఈస్ట్ జోనల్ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎలాంటి ఫీజు వసూలు చేయకుండా ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేయాలని ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీని గాలికొదిలేసి ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ప్రజలపై సుమారు 20 వేల కోట్ల రూపాయల భారం వేయడానికి సిద్ధమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చనందున ప్రజల తరఫున బీఆర్‌ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమైందన్నారు. నాయ పైసా ఖర్చు కాకుండా ఎల్‌ఆర్‌ఎస్ ఇచ్చే వరకు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద గుప్తా, ఎగ్గె మల్లేశం, ఆయా డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, తెలంగాణ ఉద్యమకారులు, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు, డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'నారీ శక్తి వందన్'తో చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పటిష్టం


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల జమున

నాగోలు: నారీ శక్తి వందన్ అనేది మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే, భారత చట్టసభలలో మహిళా ప్రాతినిధ్యాన్ని పటిష్టపరిచే చట్టం అని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమున అన్నారు. నారీ శక్తి వందన్ ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి లయ కాలంశెట్టి ఆధ్వర్యంలో బుధవారం నాగోలు డివిజన్‌లోని పీబీఆర్ కన్వెన్షన్‌లో నారీ శక్తి వందన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నారీ శక్తివందన్ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మహిళా శక్తి గురించి, దేశంలో బీజేపీ ప్రవేశపెట్టిన మహిళా సంక్షేమ కార్యక్రమాల గురించి సోదాహరణంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన దేశవ్యాప్తంగా ఉన్న మహిళా సోదరీమణులను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. ఇందులో భాగంగా నాగోల్ డివిజన్ పీబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో సమావేశానికి ముఖ్య అతిథిగా ఈటల రాజేందర్ సతీమణి జమున, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌నాథ్ యాదవ్ మాట్లాడుతూ, నారీ శక్తి వందన్ మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, మాల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి బండారు శైలజ, పాదూరి కరుణ, నందికొండ గీత రెడ్డి, కొప్పెర శ్యామల, కేశిరెడ్డి, పద్మారెడ్డి, రాధిక, సరస్వతి పాల్గొన్నారు

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష ఆదరణ


మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: స్థానిక హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్) స్థానికుల ఆదరణను విశేషంగా చూరగొంటోంది. మేళాలో కొలువైన దుస్తులు ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక


ముఖ్యమంత్రిని కలిసిన చెకోలేకర్ శ్రీనివాస్

మలక్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మలక్‌పేటకు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను ఆయన నివాసంలో కలిసిన శ్రీనివాస్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అలకాపురిలో కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌లో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

మూసాపేట: మహాశివరాత్రి సందర్భంగా అలకాపురి కాలనీలోని అలకాపురి భవన్‌లో కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా వారు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాల చేనేత కళాకారులు రూపొందించిన చేనేత వస్త్రాలు, బొమ్మలు, వస్తువులు, గాజులు, కాటన్ చీరలు అందుబాటులో ఉంచారు. చేనేత వస్త్ర కళాకారులకు అండగా నిలవడానికి ఇటువంటి ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకుడు వినోద్ తెలిపారు. ఈ ప్రదర్శనలో గృహోపకరణాలు, అన్ని రకాల వస్త్రాభరణాలు, నాణ్యమైన వస్తువులు కొనుగోలుదారులకు తక్కువ ధరలకు అందిస్తున్నామన్నారు.

అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పూడిక తీయిస్తాం


రోషన్‌దౌలా కాలనీలో డ్రైనేజీలోని పూడిక తీయిస్తున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని రోషన్‌దౌలా కాలనీలో కొంతకాలంగా డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను తొలగించాలని స్థానికులు కోరడంతో బుధవారం ఆమె పారిశుద్ధ్య కార్మికులతో తీయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, చాలా ప్రాంతాల్లో డ్రైనేజీలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించినట్లయితే నీరు సునాయాసంగా బయటికి వెలుతుందని, లేదంటే డ్రైనేజీ ఎక్కడికక్కడ జామై పొంగిపొర్లుతోందన్నారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సిల్ట్‌ను సత్వరమే తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పెంటయ్య, భీమ్రాజ్, కార్తీక్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ డీఐగా సుధాకర్



నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఐగా పని చేస్తున్న వీరస్వామి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎస్‌ఓటీలో పనిచేస్తున్న సుధాకర్ వచ్చారు.

సింగరేణిలో క్రీడా మైదానం ఏర్పాటు చేయండి: ఏఐవైఎఫ్


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని వాంబే క్వార్టర్స్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో చిన్నారుల కోసం క్రీడామైదానం నిర్మించాలని ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన బస్తీవాసులతో కలిసి సైదాబాద్ మండల కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా షేక్ మహమూద్ మాట్లాడుతూ, సింగరేణి కాలనీలోని వాంబే క్వార్టర్స్‌లో ఆట స్థలాలు లేక చిన్నారులు ఆడుకోవటం కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. సింగరేణి కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ఆట స్థలం, కమ్యూనిటీహాల్ నిర్మిస్తే చిన్నారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు శ్రీను, భారతి, లక్ష్మి, జ్యోతి, కుమార్, ఫాతీమా, ఎలీషా, ధనమ్మ, సరిత, శకుంతల పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి కుప్పలను వెంటనే తొలగించండి


స్నేహపురి కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

నాగోలు: కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డుపై ఉన్న మట్టి, ఇతర వ్యర్థాలను వెంటనే తొలగించాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని స్నేహపురి కాలనీలో కార్పొరేటర్ పర్యటించి కాలనీలో రోడ్లపై ఉన్న గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలను రాంకీ అధికారులతో మాట్లాడి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో ఉన్న రోడ్డు గుంతలకు సీసీతో ప్యాచ్ వర్క్ చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. కాలనీలోని డ్రైనేజీ, స్ట్రీట్‌లైట్స్ తదితర సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ వెంట కాలనీ అధ్యక్షుడు అనంతుల సురేందర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, నాయకులు అశ్విన్ సింగ్, కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తహసీల్దార్ సునీత

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం బస్‌స్టేషన్ ఆవరణలో మహిళా కండక్టర్లు, ప్రయాణికులులతో కలిసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను, ప్రయాణికులను సత్కరించారు. ఉత్తమ ప్రతిబ కనబర్చిన కండక్టర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అరాచకాలను ఎండగట్టాలన్నారు. ప్రతీ మహిళ ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. చదువు పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకట నర్సప్ప, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, అసిస్టెంట్ ఇంజినీర్ సత్తయ్య, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వెల్ఫేర్ కమిటీ సభ్యులు వైవీ.రెడ్డి, మల్లికా బేగం తదితరులు పాల్గొన్నారు.

జేఏసీతోనే పెన్షనర్ల సమస్యల పరిష్కారం సాధ్యం

వనస్థలిపురం: పెన్షనర్ల పెండింగ్ సమస్యలు, పెండింగ్ డీఏలు, మంచి పీఆర్‌సీ అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పొందుపర్చడంతో ఆ పార్టీకి ఇచ్చామని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి చైర్మన్ కె.లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టి.సుభాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఎన్నికలప్పుడు మేము ఎవరికీ మద్దతు తెలపమని ప్రకటనలు ఇచ్చిన మరో పెన్షనర్ల సంఘం నాయకులు సమన్వయ కమిటీ పేరుతో నూతన ప్రభుత్వంలోని సీఎం, మంత్రులను కలుస్తూ డీఏలు ఇవ్వండి, మంచి పీఆర్‌సీ ఇవ్వండి అని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటువంటి నాయకులు పెన్షనర్ల హక్కులు, సమస్యల పరిష్కారం సాధించలేరని, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) మాత్రమే పెన్షనర్లకు మేలు జరిగే విధంగా కార్యాచరణ చేపడుతుందని వారు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

బాధితురాలి కుటుంబసభ్యులపై భర్త దాడి

మలక్‌పేట: చైతన్యపురిలో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మలక్‌పేటలో ఆమెకు చికిత్స అందిస్తున్న ఆసుపత్రి వద్ద ఆమె బంధువులపై భర్త దాడికి పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లాకు చెందిన తిరుమలేష్(27)కు బంధువుల అమ్మాయి ఊహతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. మొదటి నుంచి వీరి వివాహం నచ్చని తిరుమలేష్ కుటుంబసభ్యులు ఊహను వేధిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె రెండు రోజుల క్రితం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. తల్లిదండ్రులు మలక్‌పేటలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చి చికిత్స అందిస్తున్నారు. అయితే మంగళవారం హాస్పిటల్ వద్దకు చేరుకున్న భర్త, అతని స్నేహితులు ఊహ కుటుంబసభ్యులపై దాడి చేసి గాయపర్చారు. తమపై తిరుమలేష్ స్నేహితులతో కలిసి దాడి చేస్తే మలక్‌పేట పోలీసులు ఇరువర్గాలపై ఎలా కేసులు నమోదు చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. తిరుమలేష్ తనకు ఫోన్ చేసి నిన్ను నీ కుటుంబ సభ్యులను అంతం చేస్తానని హెచ్చరిస్తున్నాడని, తనకు, తన కుమారుడికి న్యాయం చేయాలని బాధితురాలు ఊహ మీడియాతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు.

చైతన్యపురి ఠాణాలో తల్లిదండ్రుల కేసు...

చైతన్యపురి: అదనపు కట్నం కోసం భర్త, మామ, భర్త స్నేహితులు వేధించడంతోనే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని బాధితురాలు ఊహ (22) తల్లిదండ్రులు బుధవారం సాయంత్రం చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. చైతన్యపురి నివాసి తిరుమలేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించామని, అదనపు కట్నం కోసం భర్త తిరుమలేష్, మామ భాస్కర్, తిరుమలేష్ స్నేహితులు సందీప్, మహేష్, గణేష్ వేధించడంతో నిద్రమాత్రలు మింగి తమ కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసిందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. దీంతో భర్త, మామలతో పాటు స్నేహితులపై కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అనారోగ్యంతో నిద్రలోనే వ్యక్తి మృతి

సంతోష్‌నగర్: అనారోగ్యంతో ఓ వ్యక్తి నిద్రలోనే మృతి చెందిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ టౌన్‌షిప్ ప్రాంతానికి చెందిన ఉమా, తిరుపతయ్య (42) దంపతులు. తిరుపతయ్య డీఎంఆర్‌ఎల్‌లో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఆరేళ్లుగా తిరుపతయ్య హెచ్ఐవీ చికిత్సలు చేయించుకుంటున్నాడు. దీనికి తోడు అతనికి బీపీ, షుగర్‌తో పాటు మద్యం తాగే అలవాటు ఉంది. రోజూ మాదిరిగానే ఈనెల 5న రాత్రి 10 గంటలకు ఇంట్లోకి వెళ్లి నిద్రపోయాడు. కాగా బుధవారం ఉదయం 11 గంటల సమయంలో తిరుపతయ్యను నిద్ర లేపేందుకు యత్నించగా.. స్పందించ లేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా.. వారు వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పాదయాత్రతో ప్రజా సమస్యల పరిష్కారం


బస్తీలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బస్తీలలో పాదయాత్రలు నిర్వహిస్తూ.. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. బుధవారం ఆయన రెయిన్‌బజార్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి డివిజన్ పరిధిలోని ఇమ్లీబన్, ముర్తుజానగర్, అలీనగర్, ఖురేషీలైన్, మౌల్లాకా చీల్లా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకుఅన్ని ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహిస్తూ.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి పనులను పరిశీలించి పురోగతిపై అధికారులతో చర్చించామని తెలిపారు.